
# పతనం



పంతుల జోగారావు

డిసెంబరు నెల చివరి వారంలో ఓ రోజు. తెల్లవారడానికింకా రెండు గంటలయినా టైముంది. చలి హెచ్చుగా ఉంది, బస్సుల అలికిడి కొద్దిగా మొదలయింది. ఒకటీ అరా టీ కొట్లు తెరిచారు. ఫస్టు బస్సుల వాళ్ళు బస్సుల్ని లైన్లో పెట్టి వాళ్ళలో వాళ్ళేదో మాట్లాడుకుంటున్నారు.

నారయ్య టీ కొట్లో పెట్రోమాక్సు లైటు మందకొడిగా వెలుగుతోంది. దానికి గాలి కొడుతూ "కొండయ్యా! ఆ వొంటి పేగు సన్నాసిగాడు నెగిసాడో నేడో సూడుమీ" అనరిచేడు నారయ్య.

కొండయ్య గది వెనుక వసారాలో చెట్నీ రుబ్బుతున్నాడు. పని ఆపి చేతులు నొక్కు-కుంటూ లేచాడు.

వసారాలోనే మరో మూల పాత బెంచీ బల్ల మీద మాసిన దుప్పటి తల మీదుగా ముసుగు వేసుకుని ముడుచుకు పడుకున్నాడు శివుడు. నారయ్య ఇప్పుడు వొంటిపేగు సన్నాసిగాడని పేర్కొన్నది వాడినే.

బకెట్లో నీళ్ళతో చేతులు కడుక్కుని వాడి దగ్గర కొచ్చేడు కొండయ్య.

"శివా! ఒరే శివా ... నెగిసి ముకం కిడుక్కోరా - టీ నెడీ అయిపోనాది... గుక్కెడు తాగినావంటే గుమ్ము గుంటాది" అని హుషారునిస్తూ తట్టి లేపాడు.

శివుడు బద్ధకంగా లేచాడు. బల్ల దిగి నించున్నాడు. నిద్ర మత్తుతో వాడి కళ్ళు బరువుగా వాలిపోతున్నాయి. నిద్ర ముంచుకు వస్తూంటే తిరిగి బెంచీ ఎక్కి పక్క మీద ఒరిగి పోయాడు. వాడి జబ్బ పట్టుకుని

"అత్తెరీ - మళ్ళా తొంగుంటాడూ? తలమ్మ కన్నోడికి వొంటి బద్ధకం రాదురా నాయనా... కంటికున్న కూ-ఒంటికి సోకు, ముండా బట్టలూ కలిగినోల్లకే గాని మనలాంటి అవుకు నాయాల్లకి కాదురా నెగు-నెగు" అన్నాడు కొండయ్య.

శివ మూలుగుతూ లేచి గూట్లోంచి వేపపుల్ల తీసి నోట్లో వుంచుకుని నూతి వేపు దారి తీసాడు.

వాడు ముఖం కడుక్కుని వచ్చేసరికి కొండయ్య వాడికి గ్లాసుతో టీ యిచ్చాడు. టీ తాగి పనిలోకి దిగాడు శివుడు.

"నెగి సావడీ మారాజులు? బేగి నీవు రట్టుకుని గదంతా నిబ్బగ తుడిసెయ్యాలి... సీకాకళం బస్సులోళ్ళా. పేసింజర్లూ టిపినీ కొస్తాప సిటవాగితె' అని వాడికి పని పురమాయించేడు నారయ్య.

* * *

ఎనిమిదయింది. నారయ్య టీ కొట్లో బేరం చురుగ్గా సాగుతోంది. బజారు, బస్టాండు జనంతో కళకళలాడుతోంది.

"బాబూ..."

కౌంటరు దగ్గర కూర్చున్న నారయ్య తలెత్తి చూసాడు. శివుడు తండ్రి. మాసిన చిరుగుల పంచె, పైమీద నాగులగావంచా గుడ్డ.

"నువ్వెరా నాయనా ఏటిలా దిగబడ్డావు" విసుగ్గా అడిగాడు నారయ్య.

"వాడకం కావాలి బాబూ ... డబ్బుకి కొంచెం కటా ముటీ అయిపోతున్నాది"... అని దీనంగా ఉన్నాయి వాడి మాటలు.

"పీకమొయ్య తాగి తొంగోడానికై పోతే నీకెందిరా డబ్బులు" వెక్కిరింతగా అన్నాడు నారయ్య.

"లేదయ్యా - మునిల్దాయికి పేణం మీదికొచ్చింది ఎంకన్న సాచ్చిగా సెపున్నా బాబూ..." వాడు బ్రతిమలాడటం, దేబిరించడం ప్రారంభించాడు.

ముందు గదిలో మాటలు వినిపించి అక్కడికొచ్చేడు కొండయ్య. 'ఈడకే టివ్వకండి బాబూ - పాపం శివ గోడికి జుబ్బాలెండూ సిరిగిపోనాయి. మీ కాడ జీతం యిడుకోని ఈ నెలో మీదిటికో కుట్టించుకుంటాడు - ఈడికిచ్చినారంటే పాకమ్మ కొట్లో గవల్మెంటు సారా తాగటానికే కరుసవుద్ది అన్నాడు" నారయ్యతో.

శివుడి తండ్రి కొండయ్యతో ఘర్షణ పడ్డాడు. శివుడు ఏం మాట్లాడాలో తెలీక చూస్తూ నిల్చుండిపోయాడు.

"సరె ... సరే ... ఎల్లి మీ పన్లు సూసుకోండి" అని వాళ్ళిద్దర్నీ కసిరి శివుడి తండ్రికి ఓ రెండు రూపాయలిచ్చి పంపేశాడు నారయ్య. వాడు ఒంగి ఒంగి దండాలు పెట్టి మరీ వెళ్ళిపోయాడు.

కొండయ్య శివుడి మీద చిర్రుబుర్రులాడేడు! "ఎదవ బుద్ధిగేనం నేదేటిరా-ఇవ్వొద్దననేక పోనావేటి? నువ్విక్కడ రెక్కలిరుసుకుని సాకిరీ సెయ్యడం అదొచ్చి నీ జీతం వొట్టుగెళ్ళి పీకవరకు తాగిడం-ధూ."

శివుడి కళ్ళలో గిర్రున సీళ్ళు తిరిగాయి.

చిన్నప్పుడే శివకి తల్లి పోయింది. అవ్వే యింట్లో ఆడ దిక్కు. అయ్యకి మస్తుగా తాగటం అందర్నీ బూతులు తిట్టడం తప్ప వేరే పని లేదు. తనకి చదువుకోవాలనుండేది. కాని వద్దనడం తెలీని రోజుల్లో

తనని తీసుకొచ్చి నారయ్య టీ కొట్లో పనికి కుదిర్చాడు అయ్య. తిండీ పడకా అంతా యిక్కడే. ఉదయం పని పూర్తయాక నారయ్య గారింటికి వెళ్ళాలి. అక్కడ వాళ్ళు చెప్పిన పన్లన్నీ చెయ్యాలి ఎంత వాళ్ళు వంచి పని చేసినా తనని అందరూ నీచంగా ఎందుకు తిడుతూ వుంటారో వాడికి తెలీదు.

నిజానికి తనంటే జాలి పడేది కొండయ్య ఒక్కడే.

*　　*　　*

టీ కొట్లో పని పూర్తి చేసుకుని రెండో పూట పని కుర్రాడు వచ్చేక శివుడు తిన్నగా నారయ్య ఇంటికి కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళాడు.

వాడికి పధ్నాలుగేళ్ళుంటాయి. తొలి నుంచి ఎవరి ఆదరణా లేకుండా గాలివాటుకి పెరిగినవాడు. తనేమిటో - వర్తమానమేమిటో - భవిష్యత్తేమిటో ఆలోచించుకోగల్గటానికి వాడికి సాధారణమయిన చదువు కూడా లేదు 'ఒకళ కాడ పనికి కుదిరి తలమ్ముకున్నాక వాళ్ళొంచి పని సెయ్యాలిరా శివా! యజమాని మెచ్చాలి ఆళ్ళకి మన పని నచ్చాలి' అన్న కొండయ్య మాటలే వాడికి వేదం. చాకిరీ చెయ్యడమే తప్ప ఆలోచించడం వాడికి తెలీదు

నారయ్య తండ్రి ముసలయ్య. పొగాకు చుట్టుకుంటూ ఎండ కాగుతూ కూర్చున్నాడు. శివుడి రాకతో అతడి ముఖం వికసించింది. వచ్చేవురా శివా! నీ కోసమే సూస్తున్నా- బేగి పాత్రతో గారింటికెళ్ళి రావాలిరా ... సరుకయిపోనాది... పెందిల నెగిసిన కాడ్నుంచి అదినేక నాలుక జివ్వుమంటోందిరా... బేగి పొర్రా! అంటూ వాడి చేతిలో రూపాయ నోటు పెట్టాడు ముసలయ్య.

నల్ల మందు దొరకటం కష్టమైపోయాక జగన్నాధపాత్రతో యిచ్చే మదన కామేశ్వరీ లేహ్యం వుండలకి బాగా అలవాటు పడిపోయేడు ముసలయ్య. ఆ వుండలు మింగి మత్తుగా అస్తమానం పడుకుని వుంటాడు. అవి లేకపోతే గంగ వెర్రులెత్తిపోతాడు. ఆ వుండలు తెచ్చి పెట్టడానికి శివుడు తప్ప మరెవడూ లేరతనికి.

ముసలయ్య కోసం వాటిని తెస్తూ శివుడు కూడా వాటి రుచి మరిగాడు. ఒక్కోసారి పావలా అర్ధా మిగిలితే ముసలయ్య పేరు చెప్పి వుండలు తెచ్చుకుని, పని పూర్తయాక రాత్రి పూట వాటిని మింగి పడుకుంటూ వుంటాడు కూడా.

శివుడు వుండలు తెచ్చి ముసలయ్యకిచ్చి యిల్లు ఊడ్చటం ప్రారంభించాడు. గది ఊడుస్తూ వుంటే వాడి నడుం విరిగేలా దభీమని ఓ గుద్దు పడింది. బాధగా తలెత్తి చూసాడు శివుడు. నారయ్య కొడుకు శీను. పదో తరగతి చదువుతున్నాడు. శివుడి జుట్టు పట్టుకుని గుంజుతూ "లంజకొడక నీకు పొగరెక్కువయిందిరా - నేను సెప్పిన పనేటిసేసినావురా?" అనడిగాడు.

తండ్రికి తెలీకుండా టిఫిన్ పేకెట్లు తెచ్చి యివ్వమని శివుడ్ని వేధించుకు తింటూ వుంటాడు వాడు. నారయ్య ఉదయాన్నే ఇంట్లో అందరికీ రెండేసి యిడ్లీలు పంపిస్తాడు. అవి తిని పూరుకోవలసిందే. మరే టిఫినూ యివ్వడానికి వొప్పుకోడు.

రేపుగాని పూరీలు, దోసె తెచ్చివ్వకపోయావంటే చూడు... అని బెదిరించి మరీ వదిలేడు శీను. సుమారు తన వయసువాడే అయినా తన మీద అంత జులుం చెలా

(మిగతా 28వ పేజీలో)

(23 వ పేజీ తరువాయి)

ంచే అధికారం శీను కెక్కడి నుంచి వచ్చిందో శివుడికి ఊహ కందదు. అప్పటికీ కొండయ్యని ప్రతిమలాడి శీనకి దొంగతనంగా టిఫిన్ పేకెట్లు చేరవేస్తూ వుంటాడు. వాడి కోసం తెచ్చే టిఫిన్లలో కొద్ది కొద్దిగా కాజేసి కక్కుర్తి పడటం కూడా వాడికి నీచంగా తోచలేదు. నారయ్య పెద్ద కూతురు జగదాంబ ఎవరూ లేకపోవటం చూసి తనను వాటేసుకుపోవటం మొదట్లో వింతగా, భయం భయంగా అనిపించినా అదీ అలవాటయింది వాడికి.

నారయ్య ఇంట్లో పని పూర్తయాక టీ కొట్టు కెళ్ళాడు శివుడు. వాడి ముఖం డోక్కుపోయి ఉంది. మనిషి నీరసంగా వున్నాడు. ఈ మధ్య కొద్ది రోజులుగా అలాగే వున్నాడు.

సాయంత్రం ఏడు దాటుతోంది. కొట్టు మూసేసే వేళ. శివుడు రావటం చూసి దగ్గరికి పిలిచేడు నారయ్య.

“ఏటలాగ డిగాలు పడిపోతున్నావు రోజు రోజుకీనూ? నేను సెప్పానని ఓ పాలి డాక్టరు బాబు కాడికెళ్ళు” అని గొంతు తగ్గించి, “దిగువ రాజ్జెంలో కొత్త పిట్టొచ్చి నాదట - నిజివేనట్రా” అనడిగేడు నారయ్య.

శివుడు తలూపి, ఆ వివరాలన్నీ చెప్పాడు.

ఎల్లి వాట్టు కొస్తావేటి ?

తలూపి బయలుదేరాడు శివుడు. హోటలు కట్టేశాక అప్పుడప్పుడు కులాసా పుడితే శివుడ్ని పంపించి అమ్మాయిల్ని రప్పించుకుని మజా చెయ్యడం నారయ్యకి అలవాటు.

ఆ విధంగా శివకి, దిగువ రాజ్యం అన బడే ఆ మురికి పేటలో అమ్మాయిలతోనూ వాళ్ళని పోషిస్తూ వ్యాపారాలు చేసే వాళ్ళతోనూ చిన్నప్పటినుంచీ బాగా పరిచయం వుంది.

శివుడు వెళ్ళేసరికి ఆడపిల్లలంతా “చిన బావొచ్చినాడ్రా’ అంటూ గోల చేస్తూ చుట్టూ మూగేరు

“నారయ్య మావకి నాను గుర్తొచ్చి నానేటి నా కోసమేకద నవ్వొచ్చింది” అంటూ అడిగిందొక అమ్మాయి పకపక నవ్వుతూ.

“కాదే కాంతం - నిన్నయి జీనారం నంచొచ్చినాదే ఆ పిల్ల కావాలంట అయ్య గోరికి” శివుడు జుత్తు ఎగదోసుకుంటూ అన్నాడు.

“మా మెవళం పనికిరాక పోనావేటి ముసిలోడి”కి పక పకమని విరగబడుతూ నవ్వేరంతా.

మరో పిల్ల శివుడి బుజ్జ మీద చెయ్యేసి నవ్వుతూ “బుల్లి బావేటీమద్దెన రోజుకీ దిమ్మయి పోతున్నాడు? మునపటి వుసారు నేదు” అంది.

“నీ గాలి తగిల్నాక ఆడలాగవక ఏటి సేస్తాడు లేయే.”

“చినబావ కేటొచ్చి నాద్రా - రాజా నాగున్నాడు- నాకే కసింత నలతగుంది వొంట్లో - చినబావా! ఇందీసని స్తవేటి?”

గొల్లుమని నవ్వేరంతా.

అశ్లీలతను అసహ్యించుకోవడం తెలీని వాతావరణంలో పెరిగిన శివ కూడా వారితో శ్రుతి కలిపాడు. అమ్మాయిల్ని తెచ్చినందుకు నారయ్య నయాపైసా యివ్వకపోయినా- వారిని తన ఆజమాయిషీలో వుంచుకున్న గైరమ్మ మాత్రం బేరం తెచ్చినప్పుడల్లా శివుడికి అర్ధో రూపాయో, కమీషను యిస్తూ వుంటుంది.

మరికొంత సేపటికి విజయనగరం పిల్ల కొప్పు సవరించుకుంటూ వచ్చింది. పద... పద... అని తొందర చేసాడు శివుడు.

ఇద్దరూ రిక్షా ఎక్కారు.

*  *  *

ఆ మర్నాటి ఉదయం కొండయ్య శివుడ్ని తీసుకుని డాక్టరు దగ్గర కెళ్ళాడు. డాక్టరు వాడ్ని గదిలోకి తీసికెళ్ళి పరీక్షించాడు. ఏదో యింజక్షను చేసి మాత్రలు యిచ్చేడు.

"రోజూ వస్తూండాలి నారయ్యనోసారి నేను రమ్మన్నానని చెప్పు" అని వాళ్ళిద్దర్నీ పంపేశాడు డాక్టరు.

రాత్రి హోటలు కట్టేశాక నారయ్య రిక్షాలో వెళ్ళి డాక్టరుని కలిసాడు.

'కబురెట్టార...?'

"అవునోయ్ ఉదయం మీ వంటవాడు పని కుర్రాడ్ని తీసుకొచ్చేడు చూడు, శివుడు కాబోలు వాడి పేరు..."

"అవును డాక్టరుగారూ నేనే మీ కాడికి ఎల్లమని పంపేను... ఆ డీమద్దెన వోరమయింది అదోలాగుంటున్నాడు... జబ్బేటో తెల్దు కాపీకి టికానా లేనోడు - కర్సు నేనెడతాను - బిల్లు నా పేర పంపండి. ఆడికొక్కస్త మందులూ మాకులూ సూడండి. వోరక్కర్సు పీసిల్సు గదండీ ఆళ్ళకేటొచ్చినా మనవే సూడాలి - ఏటంటారు?" అన్నాడు నారయ్య గారపళ్ళు బయట పెట్టి నవ్వుతూ.

బావుంది ఇంతకీ వాడికేం రోగమో తెల్సా? వి డీ అంటే ముండ జబ్బు..."

నారయ్య నోరు వెళ్ళబెట్టి చూసాడు. అంతలోనే సర్దుకుని కోపం తెచ్చుకుని అన్నాడు. "పట్టుమని పదిహేనేళ్ళు లేనెదవకి ముండ జబ్బా? పొయ్యే కాలం కాకపోతే ఎదవకి పెక బుద్ధులేటి సెప్పండి? తిండెడుతున్నాను బట్టలు కుట్టిస్తున్నాను పెతీ పండక్కీ, కడాకి మందూ మాకూ అవసరమయితే నా కాడ పన్చేసే వోడు కదా అని దయతల్సి నేనే ఆ కర్సూ బరిస్తున్నాను. ఆడిలా సెడిపోడవేటి సెప్పండి డాక్టరుగారూ? నెంజి కొడుకు నా పరువు తీసిన్నాడు" నారయ్య శివుడి మీది కోపంతో శివమెత్తిపోతున్నాడు

ప్చ్... వెరీ యంగ్ బాయ్. పతనం పతనమైపోయాడు డాక్టరు. తలాడిస్తూ అన్నాడు.

మీ కుటుంబంలోని యావన్మందినీ

ఆలోచింపచేసే

ప్రజాతంత్ర

ప్రతి వారం చదవండి